క్లుప్తంగా

కేసులు నమోదు చేయాలి

తిరుమలగిరి : ఖమ్మంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంచుతుండగా మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీష్ రెడ్డి, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేసిన గుండాలపై కేసు నమోదు చేసి చట్టపరమైన తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరద బాధితులకు సాయం చేయడం చేతకాక, సేవ చేసే వారిపై కాంగ్రెస్ కిరాయి గుండాలను పెట్టి దాడి చేయించడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు.

విరిగిన స్తంభాలు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విరిగిన స్తంభాలు

ఆత్మకూర్ (ఎస్) : గత రెండు రోజుల క్రితం ఉరుములు, మెరుపులు, గాలితో వర్షం కురువగా మండల పరిధిలోని బొప్పారం తండాలో మొత్తం దాదాపు 10 కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో గత మూడు రోజులుగా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం రైతులు పొలాల వద్దకు వెళ్లగా స్తంభాలు విరిగి తీగలు తెగి పడినట్లు గుర్తించారు. దీంతో వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అన్నతో కలిసి భర్తపై దాడి

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం : కుటుంబ కలహాల కారణంగా అన్నతో కలిసి ఓ మహిళ తన భర్తపై దాడి చేయడమే కాక రోడ్డుపై పడేయడంతో తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బిక్కుమల్లకు చెందిన మస్కపురం పర్వతాలు(38) మూడేళ్లగా ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెంలో గది అద్దెకు తీసుకుని సెలూన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా దంపతుల నడుమ వివాదాలు జరుగుతుండడంతో గత నెల 26న తిప్పారెడ్డిగూడెం నుంచి తన అన్న వెంకన్నను పిలిపించగా.. ఆయనతో కలిసి భవాని భర్త పర్వతాలును తీవ్రంగా కొట్టి రోడ్డుపై పడవేశారు. దీంతో పర్వతాలు పరిస్థితి విషమంగా మారడంతో ఆయన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై పర్వతాలు భార్య భవానీతో పాటు ఆమె అన్న వెంకన్నపై హత్యానేరం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

అర్వపల్లి : 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించింది. అనంతారం గ్రామానికి చెందిన లింగాల నరేష్ భార్య సురాంబ మంగళవారం పురిటినొప్పులతో ప్రసూతి కోసం సూర్యాపేటకు ఆస్పత్రికి వెళ్లడానికి 108 అంబులెన్స్‌లో బయలు దేరింది. అర్వపల్లి శివారుకు వచ్చాక నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్ ఈఎంటీ కె. వీరకుమార్, పైలెట్ వల్లాల సత్యనారాయణలు సురాంబకు అంబులెన్స్‌లోనే సుఖప్రసవం చేశారు. ఆమెకు పండంటి కూతురు జన్మించింది. తల్లి కూతుర్లను సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రవీణ్ కుమార్‌కు కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామం పాతర్లపహాడ్‌లో అంత్యక్రియలు పూర్తి



ప్రవీణ్‌కుమార్ మృతదేహం

ఆత్మకూర్ (ఎస్): అమెరికాలో మృతిచెందిన ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన తప్పి ప్రవీణ్‌కుమార్ అంత్యక్రియలు మంగళవారం పూర్తయ్యాయి. ప్రవీణ్‌కుమార్ అమెరికాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఆగస్టు 23న అక్కడ తన ఇంటి సమీపంలో స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని 11రోజుల తర్వాత ఇండియాకు తీసుకురాగా.. మూడురోజుల క్రితం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో మంగళవారం పాతర్లపహాడ్ గ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

సామర్థ్యాలు పెంపొందించాలి

నూతనకల్ : ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాములు నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్పీలు, సీఆర్పీలు వీరస్వామి, జానకిరాములు, రవీందర్ పాల్గొన్నారు.

వారి గోస వినే వారేరి..!



సుందరయ్యనగర్ కాలనీలో కూలిన ప్రహరీ

- భారీ వర్షాలకు సుందరయ్యనగర్ కాలనీ వాసుల ఇబ్బందులు
- మూడు రోజులుగా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన
- ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకోలు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో పేద ప్రజలు గూడు ఏర్పరచుకొని కూలీనాలి చేసి జీవిస్తుంటారు. కొంత మంది ఇల్లులు బాగానే నిర్మించుకున్నా.. మరికొంత మంది పూరిగుడిసెలు, రేకుల షెడ్లు వేసుకొని జీవితం నెట్టుకొస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వీరి కాలనీకి సమీపంలో ఉన్న ఓ కంపెనీకి చెందిన ప్రహరీ కూలింది. ఆ గోడ సమీపంలో ఉన్న ఇళ్లపై పడటంతోపాటు వరద మొత్తం ఇళ్లలోకి వెళ్లింది. దీంతో వారి సామన్లు మొత్తం తడిసి ముద్దయ్యాయి. రెండు రోజులు రాత్రుళ్లు నిద్రాహారాలు మాని అవస్థలు పడ్డామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకునేందుకు ఎవరు కూడా ఇప్పటి వరకు రాలేదని చెబుతున్నారు. తాము తిండి వండుకోవడానికి కూడా సరుకులు లేవని, దూర ప్రాంతాల నుంచి బంధువుల ఇంటి నుంచి తెప్పించుకొని భోజనం చేస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. వారి ఇళ్లలో ఇప్పటి వరకు వరద నీళ్ల అలాగే ఉండడంతో నిలబడే పరిస్థితి లేదు.



ఇంటిలోకి చేరిన నీటిని తోడిపోస్తున్న ఆంకుడోతు వీరన్న

ఈ చిత్రంలో కనబడుతున్న వ్యక్తి జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. ఈయన పేరు ఆంకుడోతు వీరన్న. అతడు కాలనీలో చిన్నపాటి పూరి గుడిసె వేసుకొని నివాసముంటూ చిన్న డబ్బా కొట్టుపెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే మూడు రోజులుగా కురిసిన వర్షానికి పూరి గుడిసెలోకి వరద నీరు చేరి సామన్లు, ఇతర వస్తువులు పూర్తిగా నీట మునిగాయి. పూరిగుడిసెలో ఈయనతో పాటు అతడి తమ్ముడు, భార్య ఉంటున్నారు. అయితే ఇంట్లోకి వరద నీరు చేరి నిలువ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరద వచ్చిన రాత్రి డబ్బాకొట్టులోనే తలదాచుకున్నామని చెబుతున్నారు.



సుందరయ్య కాలనీలోని ఓ ఇంట్లో నిలిచిన నీరు



ధ్వంసమైన ఇల్లును చూపిస్తున్న మహిళ

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

మద్దిరాల : మండల పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణలు మంగళవారం పర్యటించారు. గుమ్మడవెల్లిలో దెబ్బతిన్ని ఇళ్లను పరిశీలించారు. మద్దిరాలలోని కొత్త చెరువు కట్ట స్వల్పంగా దెబ్బతినడంతో దానిని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గుండు వెంకన్న, మాన్‌సింగ్, హరికృష్ణ, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల కొత్త చెరువును ఇరిగేషన్ అధికారితో కలిసి పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

నీట మునిగిన పంటల పరిశీలన

నాగారం : వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ డిమాండ్ చేశారు. డి.కొత్తపల్లిలో వర్షాలకు నష్టపోయిన పంటలను మంగళవారం అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాల మూలంగా జిల్లాలో 3లక్షల ఎకరాలకు పైగా పంటలకు నష్టం జరిగిందని అన్నారు. తుపాను వల్ల చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాలకు తెగిన చెరువులు, కుంటలను వెంటనే మరమ్మతు చేయించాలని కోరారు. నష్టపోయిన పంటలను తక్షణమే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, బయ్యం లింగయ్య, సంపెట కృష్ణమూర్తి, కసం వీరయ్య, నాతి ఉప్పలయ్య, శ్రీను పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన

తుంగతుర్తి : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న రోడ్లను ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం పరిశీలించి అంచనా వేశారు. రోడ్ల తాత్కలిక మరమ్మతుల కోసం అయ్యే ఖర్చును అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్అండ్‌బీ డీఈఈ పద్మావతి, ఏఈఈ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



నాగారం : డి.కొత్తపల్లిలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు



మద్దిరాల : గుమ్మడవెల్లిలో వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చెవిటి వెంకన్న యాదవ్

రైతులను ఆదుకోవాలి

తుంగతుర్తి : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం రావులపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి, పత్తి పంటలు నీట మునిగాయని, దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. వెలుగుపల్లి–కేశవాపురం, సంగెం– కోడూరు, రావులపల్లి–మానాపురం మధ్య ఉన్న బంధంలు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోతున్నాయని అన్నారు. ఆయనతో పాటు రాములుగౌడ్, గోపాల్‌రెడ్డి, సాయిలు, దశరథ, సుధాకర్, ప్రసాద్, మనోజ్ ఉన్నారు.

రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ



సూర్యాపేట రూరల్ : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ కృష్ణసందీప్

సూర్యాపేట రూరల్ : రుణమాఫీ కాని రేషన్‌కార్డు లేని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్ అన్నారు. మంగళవారం కేసారం గ్రామ రైతువేదికలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. రైతు పేరు ఆధార్‌లోని పేరులో మార్పులు ఉన్నట్లయితే సంబంధిత బ్యాంకుల్లో ఈ నెల 7వ తేదీ వరకు అప్డేట్ చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ముత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి అర్హులైన రైతుల నుంచి మండల వ్యవసాయ అధికారులు మంగళవారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మురళీబాబు మాట్లాడారు. రుణమాఫీ జాబితాలో పేర్లు రాని అర్హులైన రైతులను గుర్తించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 90మంది రైతుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నాగారం : లక్ష్మాపురం గ్రామంలో పంట రుణమాఫీకి సంబంధించి కుటుంబ నిర్ధారణ కోసం మండల వ్యవసాయ అధికారులు మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి.కృష్ణకాంత్ మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారుల వద్ద తమ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సాయిరాజ్, శ్రీను, శ్వేత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరదలతో రాకపోకలకు ఇబ్బందులు



పొంగిపొర్లుతున్న గాంధీనగర్ వాగు

సూర్యాపేట రూరల్ : గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు అలుగుపోశాయి. దీంతో రాకపోకలకు వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలోని రామారం, యర్కారం, కాసరబాద, గాంధీనగర్, పిల్లలమర్రి, పిన్నాయిపాలెం చెరువులు అలుగుపోశాయి. కుసుమవారిగూడెం వద్ద మిర్యాలగూడెం–బీమారం రహదారిపై ఉన్న వాగు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదే విధంగా కాసరబాద గ్రామం నుంచి సూర్యాపేట పట్టణానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో సుమారు 500ఎకరాల మేర పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తిస్థాయి నివేదికను నాలుగు రోజుల్లో అందజేయనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడ్డాం

వర్షాలతో కాసరబాద వాగు పొంగిపొర్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వర్షం వచ్చినప్పుడల్లా వాగు పొంగిపొర్లడంతో సూర్యాపేట పట్టణానికి రావాలంటే ఇబ్బంది అవుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నాం.

– నాగరాజు, కాసరబాద

వర్షాలకు దెబ్బతిన్న బీటీ రోడ్లు

అర్వపల్లి : భారీ వర్షాలకు రోడ్లు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. ఇప్పటికే అనేక రోడ్లు బీటీ రెన్యూవల్‌కు నోచుకోక గుంతలమయమయ్యాయి. దీనికి తోడు భారీ వర్షాల మూలంగా ఈ దారులు మరింత దెబ్బతిన్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలోని మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగించే తిమ్మాపురం–సంగెం రహదారి బీటీ రెన్యూవల్‌కు నోచుకోక అధ్వానంగా ఉంది. అయితే భారీ వర్షాలతో ఈ రోడ్డు మరింత దెబ్బతింది. అర్వపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే మారింది. ఈ రోడ్ల బీటీ రెన్యూవల్‌కు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అర్వపల్లి–కొమ్మాల బీటీ రోడ్డు వర్షాలకు దెబ్బతింది. వివిధ గ్రామాల్లో లింకురోడ్లు వరదలకు పూర్తిగా పాడయ్యాయి. వీటిని వెంటనే మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



బీటీ లేచిపోయి అధ్వానంగా మారిన అర్వపల్లి-కొత్తగూడెం రహదారి



గుంతలమయమై నీటితో నిండిన తిమ్మాపురం-సంగెం రహదారి

దెబ్బతిన్న పంటలు.. ఆవేదనలో రైతులు



తుమ్మల పెన్‌పహాడ్‌లో వరి పొలంలో ఇసుక మేట



నూతనకల్‌లో నీట మునిగిన పత్తి పంట

చివ్వేంల : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పంటలు నష్టపోయారు. చెరువులు అలుగుపోయడంతో వరిపొలాలపై నుంచి వరద ప్రవహించి ఇసుక మేటలు వేశాయి. మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్, లక్ష్మణ్ నాయక్ తండా, బి.చందుపట్ల, అక్కలదేవిగూడెం, తిమ్మాపురం, మోదిన్‌పురం తదితర గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో మిరప, పత్తి చేలల్లో నీరు నిలిచాయి. దీంతో రైతులు పంటను దక్కించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మండల వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో వరిపంటలకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి డి. వెంకటేశ్వర్లు తెలిపారు.

వరి, పత్తి పంటలకు నష్టం

నూతనకల్ : వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. మాచనపల్లి గ్రామ శివారులో పాలేరు వాగు ఉధృతికి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న పశువులు ప్రాణాలు విడిచాయి. గ్రామానికి చెందిన ఉప్పుల ఉప్పలయ్య, ఉప్పుల గంగయ్య, వేల్పుల ఉప్పలయ్య, వేల్పుల గంగయ్యలకు చెందిన ఏడు పశువులు మృత్యువాత పడ్డాయి. మిర్యాలలో ముత్యాలమ్మ కుంట తెగిపోవడంతో 12 మేక పిల్లలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి.

250 ఎకరాల్లో పంటలకు నష్టం

పెన్‌పహాడ్ : గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో వరి పంటకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. వివిధ గ్రామాల్లో వరద ప్రవాహం వల్ల చెరువులు అలుగు పోయడంతోపాటు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించి పంట పొలాలు కొట్టుకుపోయాయి. ఇసుక మేటలు వేశాయి. మండలంలో సుమారు 250 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

ఇసుక మేటలు..

ఆత్మకూర్ (ఎస్) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు, వాగులు నిండి అలుగులు పోస్తున్నాయి. వర్షాల దాటికి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో మండల వ్యాప్తంగా దాదాపు 70 ఎకరాలకు పైగా వరి పంటలో ఇసుక మేటలు పేరుకుపోయాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మద్దిరాల మండలంలో..

మద్దిరాల : మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చెరువులు, వాగులు పొంగిపోర్లాయి. దీంతో వరి, పత్తి, పెసర, పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వ ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

5 ఎకరాల పెసర పంట దెబ్బతిన్నది

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు బాదవత్ బీబీ. ఈమెది మద్దిరాల మండలం రాజనాయక్ తండా. ఈమె 5ఎకరాల్లో పెసర పంట, రెండు ఎకరాల్లో పత్తి పంట, ఎకరంన్నర వరి పంటను సాగు చేసింది. అయితే వరద ప్రభావానికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



దెబ్బతిన్న పెసర పంటను చూపిస్తున్న బీబీ

ప్రభుత్వం ఆదుకోవాలి



గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని పెద్ద చెరువు అలుగు పోయడంతో పోలాలపై వరద ప్రవహించింది. దీంతో నా పోలంలో ఇసుక మేటవేసి ఎకరం పోలం కోట్టుకుపోయింది, రూ.30 వేలు పెట్టి సాగు చేశాను. పెట్టిన పెట్టుబడి కూడ వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మాదగాని మల్లయ్య, రైతు, వట్టిఖమ్మంపహాడ్

మిరప తోటలో నీళ్లు నిలిచాయి



భారీ వర్షం రావడంతో మిరప చేనులో వర్షం నీళ్లు నిలిచాయి. దీంతో మొక్కలు ఎర్రబారాయి. వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట వర్షం వల్ల పాడైంది. నష్టం పరిహారం అందించి ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలి.

– ఎం. సైదులు, లక్ష్మణ్ నాయక్ తండా



సింగారెడ్డిపాలెంలో నీట మునిగిన వరి పొలం



చివ్వేంల : లక్ష్మణ్ నాయక్ తండాలో వర్షానికి దెబ్బతిన్న మిర్చి పంట

సద్దల చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

సూర్యాపేటటౌన్ : పట్టణ పరిధిలోని సద్దల చెరువులో మంగళవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హైటెక్ బస్టాండ్ సమీపంలో గల ఇందిరా కాలనీకి చెందిన చిరువ్యాపారి కొడిమాల వెంకటేశ్వర్లుకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కొడిమాల రాజు(25) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికి గురైన రాజు ఈ నెల 1వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకు కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. గత రెండ్రోజులుగా కుటుంబ సభ్యులు రాజు ఆచూకీ కోసం వెతుకుతుండగా మంగళవారం మధ్యాహ్నం సద్దల చెరువులో శవమై కనిపించాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

తిరుమలగిరి : తెలంగాణలో సమగ్ర కులగణన జరిపి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుపరచాలని బీసీ హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష పదవ రోజుకు చేరుకుంది. దీంతో సిద్దేశ్వర పటేల్‌ను మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు, కొత్తగట్టు మల్లయ్య, వంగరి బ్రహ్మం పాల్గొన్నారు.

డిపో ఏర్పాటు చేయాలని వినతి

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని సూర్యాపేట ఆర్టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ సైదులుకు మంగళవారం ఆర్టీసీ డిపో సాధన కమిటీ సభ్యులు సూర్యాపేటలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య, సీహెచ్. హనుమంతు, పోరెల్ల లక్ష్మయ్య, కొమ్ముటింటి నగేష్, నాగరాజు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు